క్లుప్తంగా

నేడు అప్పాపురంలో జగనన్న సురక్ష

కాకుమాను: మండలంలోని అప్పాపురం గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో గ్రామస్తులకు 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన ఎంపీడీఓ కోరారు.

శతాధిక వృద్ధుడి మృతి



కాకుమాను: మండల కేంద్రం కాకుమానుకు చెందిన శతాధిక వృద్ధుడు కొల్లా సుబ్బారావు(102) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. వందేళ్ల వయస్సులోనూ ఒకరిపై ఆధారపడకుండా తన పని తానే చేసుకునే వారు. తాను మరణించినా నేత్రాలు వేరేవారికి ఉపయోగపడాలనే ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు శంకర్ నేత్రాలయానికి దానం చేశారు.

యువతి అదృశ్యం

కాకుమాను:యువతి అదృశ్యంపై బుధవారం కేసు నమోదైనట్లు ఏఎస్ఐ ఆర్.కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని వల్లూరికి చెందిన ఓ యువతి తల్లిదండ్రులు చిన్న వయస్సులోనే మరణించడంతో ఇంటర్ వరకు చదువుకుని మూడేళ్ల నుంచి తాత వద్ద ఉంటోంది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాకపోవడంతో ఆమె తాత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలుడి అదృశ్యం



గుంటూరు రూరల్: బాలుడి అదృశ్యంపై నల్లపాడు పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరాలులోని బాలాజీనగర్ 11వ లైనుకు చెందిన ఉప్పుతల్ల లక్ష్మి, బాలరాజు కుమారుడు కార్తిక్ స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 18న ఉదయం కాలకృత్యాలకు అని ఇంట్లోంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు బుధవారం నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు నల్లపాడు పోలీసు స్టేషన్ 8688831590 లేదా, బాలుడి తండ్రి 6303768169 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళలకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించాలి

గుంటూరు ఈస్ట్: మహిళలకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించాలని వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ తెలిపారు. అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులతో బుధవారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మహిళ పోలీసులంతా తమ పరిధిలో ఒంటరిగా నివసిస్తున్న మహిళల్ని గుర్తించి, వారి రక్షణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. మత్తు పదార్థాలు, సింగిల్ నంబరు ఆట, పేకాటలు వంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే పై అధికారులకు తెలియజేయాలని తెలిపారు. మహిళల్ని తరచూ కలసి వారి సమస్యలు తెలుసుకోవాలని, రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సీసీ కెమెరాలు అన్ని సెంటర్లలో ఏర్పాటు చేసే విధంగా ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం మహిళా పోలీసు జాబ్ చార్ట్‌పై చర్చించారు.

వివాహిత ఆత్మహత్య

పట్నంబజారు: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్దుంనగర్‌లో నివాసం ఉండే బిట్యాల సంధ్య (25)కు ఎనిమిది సంవత్సరాల కిందట వివాహమైంది. సంతానం లేకపోవడంతో మనస్తాపానికి గురై మానసికంగా బాధపడుతుండేది. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ఆన్‌లైన్‌లో నగదు దోచుకున్న ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన పాలపర్తి గణేష్‌కు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. తాము ఐసీఐసీఐ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, బ్యాంక్ అకౌంట్‌కు పాన్ కార్డు లింక్ చేయాలని చెప్పారు. ఇతర వివరాలతో పాటు ఓటీపీ కూడా తీసుకున్నారు. అనంతరం బ్యాంకు అకౌంట్‌లోని రూ. 2.14 లక్షలు విత్‌డ్రా అయినట్లు తెలుసుకుని బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యభిచార గృహంపై దాడి

గుంటూరు రూరల్: వ్యభిచార గృహంపై పోలీసులు దాడిచేసి విటులు, నిర్వాహకులు, మహిళల్ని అదుపులోకి తీసుకున్నారు. నగరాలులోని పట్టాభిసీతారామయ్య నగర్‌లో ఓ నివాసంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారంతో దాడి చేసినట్లు సీఐ శ్రీనివాసరావు చెప్పారు. ఇద్దరు నిర్వాహకులు, విటుడు, గృహం నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూడికతీత నత్తనడక.. వర్షం వస్తే మునక

- డ్రెయిన్ల పూడికతీత పనుల్లో జాప్యం
- వర్షాకాలం ప్రారంభమైనా పూర్తికాని పనులు
- రూ.4.34 కోట్ల కేటాయింపు
- గతేడాది ఇదే పనుల కోసం రూ.3.57 కోట్లు కేటాయింపు
- రూ. కోటి దాకా అదనంగా కేటాయించినప్పటికీ ఫలితం శూన్యం
- పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం ?



మెడికల్ క్లబ్ వద్ద పీకల వాగులో పేరుకుపోయిన పూడిక



ఇటీవల కురిసిన వర్షానికి పట్టణంలో మునిగిన రోడ్డు (ఫైల్)

నెహ్రూనగర్: వర్షాకాలం వచ్చిందంటే చాలు..నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతుంటాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఏటా నగర పాలక సంస్థ అధికారులు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వేసవిలోనే డ్రెయిన్ల పూడికతీత చేపడుతుంటారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో, చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లన్నీ మురుగునీరుతో నిండిపోతున్నాయి. దగ్గరుండి పర్యవేక్షణ చేసి, పూర్తి చేయించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో కాంట్రాక్టర్లకు ఆడింది ఆటగా పాడింది పాటగా ఉంది. పైపైన పూడిక తీసుకుని, బిల్లులు చేయించుకోవడం పరిపాటిగా మారింది.

నగరంలో 210 కిలోమీటర్ల డ్రెయిన్లు

నగరంలో 210 కిలోమీటర్ల మేర డ్రైన్లు విస్తరించి ఉన్నాయి. వీటిలో మేజర్ డ్రెయిన్లు 125.28 కిలోమీటర్లు, మీడియం 67.41, మైనర్ 16.25 కిలోమీటర్లుగా ఉన్నాయి. ఈ ఏడాది మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ కింద డ్రెయిన్లలో పూడికతీత పనుల్ని ఇంజినీరింగ్ అధికారులు చేపట్టారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేయకపోవడంతో వర్షం పడిన ప్రతిసారి గుంటూరును మురుగు ముంచెత్తోంది.

నగరంలో ప్రధాన మైన డ్రైన్లు ఇవే..

నగరంలో పీకలవాగు, నందివెలుగు రోడ్డులోని డ్రెయిన్, సుద్దపల్లిడొంక, పొన్నూరు రోడ్డులోని డ్రెయిన్, గొట్టాలబజార్‌లోని డ్రెయిన్, అంబేడ్కర్ వాగులు ప్రధానమైనవి. పశ్చిమ నియోజకవర్గంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలు నుంచి పీకలవాగు ప్రారంభమై నగరంలోని చిన్న చిన్న కాలువలు, పెద్ద డ్రెయిన్లను కలుపుకుంటూ బుడంపాడు వరకు ప్రవహిస్తుంది. వీటిన్నింటిని కలిపి తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి 68 వర్కులకు గాను, ఇంత వరకు 64 మాత్రమే పూర్తి చేశారు. ఇంకా నాలుగు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

మళ్లీ పూడిక తీయిస్తాం

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ కింద ఇప్పటికే ప్రధాన డ్రెయిన్లను శుభ్రం చేయిస్తున్నాం. సమీపంలో నివాసం ఉండే ఇళ్లల్లోంచి వ్యర్థాల్ని డ్రెయిన్స్‌లో వేయడంతో వర్షం పడినప్పుడు నిండిపోతోంది. మరలా శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.
–పి.వి.కె.భాస్కర్, సూపరింటెండెంట్ ఇంజినీర్

అదనంగా వెచ్చించినా తప్పని రోడ్ల మునక

గుంటూరు నగరంలో డ్రెయిన్ల పూడికతీత పనుల కోసం నగరపాలక సంస్థ రూ.4.34 కోట్లు వెచ్చించింది. గతేడాది ఇదే పనుల కోసం రూ.3.57కోట్లు ఖర్చు చేశారు. ఈసారి పూడిక తీత పనుల కోసం రూ.కోటి దాకా అదనంగా నిధులు కేటాయించినప్పటికీ ఫలితం శూన్యంగా కనిపిస్తోంది. ఇందుకు నిదర్శనం కొద్ది రోజుల కిందట కురిసిన వర్షాలకు నగరపాలక సంస్థ కార్యాలయం మునిగిపోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పాతమల్లాయపాలెంలో వివాదం
- ముగ్గురికి గాయాలు

గుంటూరు రూరల్: పాతమల్లాయపాలెంలో పాత కక్షలు మరోసారి రగిలాయి. స్థానిక దళితవాడకు చెందిన రెండు వర్గాలకు కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు, ప్రత్తిపాడు వెళ్లి బుధవారం రాత్రి తిరిగి పాతమల్లాయపాలెం వస్తున్నారు. దీంతో ఒక వర్గం కాపు కాసి వారిపై దాడి చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయని ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపారు. ఇందులో పార్టీ గొడవలు లేవని, కేవలం పాత కక్షల నేపథ్యంలోనే దాడికి పాల్పడ్డారని ఆయన చెప్పారు. బాధితులు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రమాదం లేదని తెలియజేశారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడి అరెస్టు



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్‌లో ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన పాత నేరస్తుడు వెలివోలు వెంకటేష్ రైల్వే స్టేషన్‌లో అనుమానంగా సంచరిస్తుండగా, రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించారు. మూడు ద్విచక్ర వాహనాల్ని చోరీ చేసినట్లు అంగీకరించాడు. ఇటీవల బాధితుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుడు వెంకటేష్ నుంచి వాహనాల్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పరుగులు పెడుతున్న నగరాభివృద్ధి

ఎమ్మెల్యే ముస్తఫా



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వ హయాంలో నగరాభివృద్ధి పరుగులు పెడుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని పాత గుంటూరు 8వ డివిజన్ పరిధిలోని క్రిస్టియన్‌పేటలో బుధవారం రూ. 80 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ అభివృద్ధిలో ఏమాత్రం వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో కనీసం సైడ్ కాల్వలు నిర్మించిన పాపాన పోలేదని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలన ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు అనేక అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల్ని వెచ్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలున్నా అన్ని వేళలా తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళ నేత షేక్ నూరిఫాతిమా, కార్పొరేటర్ ఇత్తి ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు, డివిజన్ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులంతా యూనిఫాంతో పాఠశాలలకు రావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులంతా ప్రతి రోజూ యూనిఫాం, బూట్లు ధరించి హాజరుకావాలని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్‌లోని హిందూ హైస్కూలును బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక ద్వారా ఉచితంగా అందజేసిన సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమయపాలన పాటించి, యూనిఫాం, బూట్లు, సాక్సులు, టైం, బెల్టు ధరించి హాజరయ్యే విధంగా పర్యవేక్షించాలని ఉపాధ్యాయుల్ని ఆదేశించారు. ఆయన వెంట ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం ఉన్నారు.

నేడు కాసరనేని సదాశివరావు శత జయంత్యుత్సవాలు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు డాక్టర్ కాసరనేని సదాశివరావు శత జయంత్యుత్సవాల్ని నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. నగర ప్రముఖులు, పాఠశాల పాలకవర్గ సభ్యులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.


స్వచ్ఛ గుంటూరులో భాగస్వామ్యం కావాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరులో నగర ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేలా నగరపాలక సంస్థ సంస్థాగతంగా మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ అభిప్రాయాల్ని ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా తెలియచేసి నగరానికి మెరుగైన ర్యాంక్ రావడంలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు. జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు నగరపాలక సంస్థ తరఫున 206 వార్డు సచివాలయాల పరిధిలో ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ-ఆటోలు కూడా అందుబాటులోకి వచ్చినందున నూరు శాతం సేకరణ చేయడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. నగర సుందరీకరణలో భాగంగా మెయిన్ రోడ్ల డివైడర్లు, ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీల వద్ద పెయింటింగ్ చేయించామని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు నగర ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజలు నేరుగా ద్వారా ఫోన్‌కి వచ్చే ఓటీపీని ఇంటి వద్దకు వచ్చే నగరపాలక సంస్థ వలంటీర్లు, కార్యదర్శులకు తెలపడంతో పాటు అభిప్రాయాల్ని తెలియజేయాలని కమిషనర్ కోరారు. ఓటీపీపై ఎటువంటి అపోహలకు గురికావద్దని ఆమె సూచించారు. ప్రజారోగ్య కార్మికులు, కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్, యాప్‌ల వినియోగం, ఓటీపీ అంశాలపై అవగాహన కలిగించాలని కమిషనర్ ఆదేశించారు.

కుల, మత, పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు

మేయర్ కావటి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నెహ్రూనగర్: నగరంలో అభివృద్ధి పనుల్ని నిర్దేశిత గడువులోపు, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 28వ డివిజన్ ఎస్‌జీఓ కాలనీ 4వ లైన్‌లో బుధవారం రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్ని కుల మత, పార్టీలకతీతంగా అందజేస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని గుంటూరు నగరంలో అభివృద్ధి పనుల్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం నగరంలో రూ.200 కోట్లతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. శంకుస్థాపన చేసిన పనుల్ని కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ నూతన కౌన్సిల్ ఏర్పడ్డాక గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు ఎంతో వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రైఫిల్ షూటింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థికి కాంస్యం



మంగళగిరి: దక్షిణ కొరియాలోని చాంగ్ వోన్‌లో ఈనెల 14వ తేదీ నుంచి 25వ తేదీవరకు జరుగుతున్న జూనియర్ ప్రపంచ రైఫిల్ షూటింగ్ చాంపియన్ షిప్‌లో నగర పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థికి కాంస్యపతకం లభించింది. యూనివర్సిటీ క్రీడా విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిశోర్ బుధవారం వివరాలు వెల్లడించారు. యూనివర్సిటీలో సీఎస్ఈ ఐటీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మద్దినేని ఉమా మహేష్ ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో కాంస్యపతకం సాధించినట్లు తెలిపారు. పతకం సాధించిన ఉమా మహేష్‌ను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో.వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావులతో పాటు పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు అభినందించారు.

డాడ్ ఫర్ గుడ్ డీడ్స్ మినిస్ట్రీ సేవలు ప్రశంసనీయం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



శిబిరంలో మాట్లాడుతున్న పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: నిరుపేదల అభ్యున్నతి, ఆర్థిక అభివృద్ధి, పేదరిక నిర్మూలనకు డాడ్ ఫర్ గుడ్ డీడ్స్ మినిస్ట్రీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. మినిస్ట్రీ అధ్యక్షుడు దుగ్గిరాల మోజెస్ ఆధ్వర్యంలో బుధవారం మామిళ్లపల్లి ఎస్‌డీఏ చర్చి ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ షాహిన్, డాక్టర్ శ్రీకాకులి ఏలియా, నూజివీడు మెడికల్ టీం, అమెరికన్ హాస్పిటల్ సిబ్బంది 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. పది మందికి కొబ్బరి మొక్కలు, పది మందికి పశువుల్ని మినిస్ట్రీ నిర్వాహకులు అందజేశారు. పేద వృద్ధులకు ప్రతి రోజు ఒక పూట ఉచితంగా అన్నదానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాలాది యానాదిరావు, ఉప సర్పంచ్ లంకపోతు పిచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, బొద్దులూరి రంగారావు, అమీరినేని సాంబశివరావు, అంబటి రాఘవయ్య, దుగ్గిరాల శివాజీ పాల్గొన్నారు.

స్వచ్ఛ పంచాయతీలకు ప్రభుత్వ గుర్తింపు

నంబూరును సందర్శించిన సెంట్రల్ టీమ్



నంబూరు పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న సెంట్రల్ టీమ్ సభ్యులు

పెదకాకాని: పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం పనుల నిర్వహణలో శ్రద్ధ వహిస్తున్న పంచాయతీలకు తప్పక గుర్తింపు లభిస్తుందని సెంట్రల్ టీం సభ్యులు అన్నారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామాన్ని బుధవారం టీం సందర్శించింది. గ్రామ సర్పంచి నంబూరు జ్యోతి, పంచాయతీ కార్యదర్శి షేక్ మాబు సుబాని సెంట్రల్ టీంకు స్వాగతం పలికారు. ముందుగా పంచాయతీలో జనాభా, విస్తీర్ణం, సిబ్బంది పనితీరు, రికార్డు నిర్వహణ అంశాల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో తిరిగి, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ప్రతి ఇంటిలోనూ వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయా.. అందరూ ఉపయోగిస్తున్నారా? అని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. చివరిగా గ్రామ శివార్లలో చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ఏర్పాటు చేసిన షెడ్డును పరిశీలించారు. నిర్వహణ, చెత్త సేకరణ, ఉపయోగిస్తున్న విధానం, సేకరించిన వానపాముల ఎరువును పరిశీలించారు. 2023 సంవత్సరానికి గాను పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్ ఆధారంగా గ్రామానికి గుర్తింపు ఇవ్వనున్నట్లు సెంట్రల్ టీం సభ్యులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



విద్యార్థినులకు వైద్య పరీక్షలు

కాకుమాను: ప్రస్తుత వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలున్నందున విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రవి ప్రసాద్ సూచించారు. స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల(బాలికలు)పాఠశాలలోని విద్యార్థినులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా రవి ప్రసాద్ మాట్లాడుతూ వర్షాల కారణంగా జ్వరం, జలుబు, దగ్గు వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున విద్యార్థినులు జాగ్రత్త వహించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో దోమలు కుట్టకుండా దోమ తెరల్ని ఉపయోగించాలని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా 450 మంది విద్యార్థినులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సువార్త విజయ స్వర్ణ కుమారి, డాక్టర్ రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పట్టాలిస్తుంటే.. చంద్రబాబు అక్కసు

వైఎస్సార్ సీపీ నాయకుడు కత్తెర సురేష్ కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: రాజధాని ఆర్- 5 జోన్‌లో పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి పక్కా ఇళ్లు నిర్మిస్తుంటే చంద్రబాబుకు అక్కసు ఎందుకని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. బుధవారం గుంటూరు భారత్‌పేట తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు, విజయవాడ ప్రాంత పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి పక్కా ఇళ్లను నిర్మించేందుకు ముందడుగు వేస్తే తప్పుడు కేసులు వేయించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దళితులంటే తొలి నుంచి బాబుకు అలుసని, ఎన్నికలు దగ్గరపడుతుండటంతో కపట ప్రేమ చూపిస్తుండటం సిగ్గుచేటన్నారు. 14 సంవత్సరాల పాలనలో పేదలు, ప్రజల కోసం ఒక్క సంక్షేమ పథకమైనా, ఒక్క సాగునీటి ప్రాజెక్టు, ఇక్క ఇల్లు అయినా కట్టించావా బాబు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమపాళ్లలో తీసుకెళుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై బురద చల్లుతున్న ఎల్లో మీడియాకు, బాబుకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాజధానిలో ఎస్సీలకు ఇళ్ల స్థలాలిస్తే ఈ ప్రాంతం మురికివాడగా మారుతుందని వ్యాఖ్యలు చేయడమంటే పేదలను కించపరచడమేనని పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఈ నెల 24న పేదల ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయడం ఖాయమని చెప్పారు. బాబుకు రాబోయే ఎన్నికలే చివరి ఎన్నికలని ఓటమి అనంతరం రాష్ట్రం నుంచి పారిపోక తప్పదన్నారు.

పవన్ రాజకీయాలకు పనికిరాడు

పవన్ కళ్యాణ్ సినిమాలు తీయడానికి తప్ప రాజకీయాలకు పనికిరాడని కత్తెర సురేష్ కుమార్ విమర్శించారు. వార్డు కౌన్సిలర్‌గా గెలవలేని పవన్ సీఎంపై అవాకులు చవాకులు పేలడం సిగ్గుచేటని, పవన్ లేదా ఆయనకు ప్యాకేజీలిచ్చి ప్రోత్సహిస్తున్న చంద్రబాబు ఇద్దరిలో ఎవరికైనా దమ్ముంటే 175 నియోజకవర్గాల్లో పోటీచేసే దమ్ముందేమో తేల్చుకొని చెప్పాలన్నారు. ఫిరంగిపురం జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ మాట్లాడుతూ మహాసేన రాజేష్‌ను అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కుల రాజకీయాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. వంగలపూడి అనిత సమావేశాల్లో చెప్పులు చూపించడం కులాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సభ్యత మరిచి ప్రవర్తించడం సిగ్గుచేటని, ఆమెకు దమ్ముంటే వైఎస్సార్‌సీపీలో దళితులకు జరిగిన మేలుపై బహిరంగ చర్చకు రావాలని కోరారు. సమావేశంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, ఎంపీటీసీలు రావూరి నరేష్, పొలడుగు దాసు, సీనియర్ నాయకులు పెరికల జేమ్స్, కొప్పుల శేషగిరిరావు, బెజ్జం సాయి ప్రసాద్, తాడికొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి ధర్మరాజు, జిల్లా ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి బాకి వెంకట స్వామి, మాజీ సర్పంచి దేవరపల్లి చినపాములు, మాజీ ఉప సర్పంచ్ మాదాసు ఏసురత్నం పాల్గొన్నారు.

యాసిడ్ నిల్వ, విక్రయాలలో అశ్రద్ధ వద్దు

ఏఎస్పీ నచికేష్ షలేకే



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ

పట్నంబజారు: నగరంలో యాసిడ్ ద్రావణం నిల్వ, విక్రయదారులతో పాటు వినియోగదారులు కూడా జాగ్రత్తలు పాటించాలని ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నచికేష్ షలేకే చెప్పారు. కొత్తపేట, లాలాపేట, పాత గుంటూరు పోలీసు స్టేషన్ల పరిధిలో శుక్రవారం యాసిడ్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యాసిడ్ వ్యాపారులతో పాటు ఉపయోగిస్తున్న షాపులు, హాస్పిటల్స్, కళాశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. యాసిడ్ క్రయ, విక్రయాలు జరిగే సమయంలో ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో కొత్తపేట, లాలాపేట, పాత గుంటూరు పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు షేక్ అన్వర్ బాషా, ఎం.సుబ్బారావు, ఎం.వి.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.